02102023-DIS-12_Layout 1 10/2/2023 4:31 AM Page 1







# కొనాలా? ఆగాలా?

## రెండు నెలల కనిష్ఠానికి బంగారం ధర

**ఎప్పుడూ** పండుగ సీజన్లో అధిక ధర పలికే బంగారం ఈ దఫా అంతర్జాతీయ పరిణామాల కారణంగా రోజురోజుకూ తగ్గిపోతున్నది. హైదరాబాద్ మార్కెట్లో శనివారం తులం ధర రూ. 58.200 స్థాయికి దిగివచ్చింది. అలాగే దేశంలోని మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో శుక్రవారం గోల్డ్ అక్టోబర్ ఫ్యూచర్ కాంట్రాక్టు రూ. 57.096 స్థాయికి, ప్రపంచ మార్కెట్లో స్పాట్ బంగారం ఔన్సు ధర 1,848 వద్ద ముగిసింది. ఇది రెండు నెలల నెలల కనిష్ఠస్థాయి.



### ఎందుకీ తగ్గుదల..

డాలర్ ఇండెక్స్ అదే పనిగా పెరుగుతూ 10 నెలల గరిష్ఠస్థాయికి చేరడం, అమెరికాలో అధిక వడ్డీ రేట్లు దీర్ఘకాలం కొనసాగుతాయన్న భయాలతో ప్రపంచ మార్కెట్లో బంగారం ధరలపై ఒత్తిడి పెంచుతున్నాయని ఆక్మే ఇన్వెస్ట్‌మెంట్ అడ్వయిజర్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుగంధ సచ్‌దేవా వివరించారు. అంతర్జాతీయ ట్రెండ్‌ను అనుసరిస్తూ భారత్‌లో సైతం పుత్తడి ధర క్షీణిస్తున్నది.

### పెరిగేదెప్పుడు

వచ్చే కొద్దిరోజుల్లో బంగారం పెరిగే అవకాశాలు కూడా ఉన్నాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ కమోడిటీ హెడ్ అనూజ్‌గుప్తా చెప్పారు. యూఎస్ గవర్నమెంట్ పాక్షికంగా షట్‌డవున్ అయితే బంగారం ధర భారీగా పుంజుకుంటుందన్నారు. అలాగే చైనాలో రియల్ ఎస్టేట్ సంక్షోభం ముదిరితే, రియల్టీ నుంచి పెట్టుబడులు సురక్షిత పెట్టుబడి సాధనంగా పరిగణించే పుత్తడిలోకి మళ్లుతాయని, దీంతో ధర పెరుగుతుందన్నారు.

### ఏమి చేయాలి..

ఇలా తగ్గుతూ ఉంటే ఇప్పుడే కొనాలా లేక మరికొద్ది రోజులు ఆగి చూడాలా అనే సందేహం పుత్తడి ప్రియుల్లో తలెత్తడం సహజం. ఈ విషయమై సచ్‌దేవా స్పందిస్తూ బంగారం మదుపరులు వివిధ ఆర్థిక గణాంకాలు, ద్రవ్య విధానాల్ని జాగ్రత్తగా గమనించాలని, ధర ఒక స్థాయి సమీపంలో కుదుటపడిన తర్వాత పెట్టుబడి నిర్ణయాలను తీసుకోవాలని సూచించారు. సాంకేతికంగా చూస్తే ఔన్సు బంగారం ధరకు తదుపరి మద్దతు 1,810 నుంచి 1,800 డాలర్ల సమీపంలో మద్దతు ఉన్నదని, 1,880 దాటితేనే తిరిగి పెరిగే ఛాన్స్ ఉంటుందన్నారు. ఇక దేశీయంగా ఎంసీఎక్స్‌లో 10 గ్రాముల పుత్తడికి రూ.57,000 స్థాయి కీలకమైన మద్దతు అని, ఈ దిగువన ముగిస్తే 56,100 వరకూ తగ్గవచ్చని అంచనా వేశారు.

# ఈ మార్పులొచ్చాయ్ తెలుసా..!

**అక్టోబర్ 1 నుంచి పెరుగుతున్న టీసీఎస్ భారం**

సాధారణంగా ఆర్థిక సంవత్సరం ప్రారంభమైనప్పుడు మాత్రమే ఏవైనా మార్పులు-చేర్పులు ఎక్కువగా చూస్తుంటాం.

కానీ ఈమధ్య అలా ప్రత్యేకమైన సమయం లేకుండా సందర్భానుసారంగా అనేక డెడ్‌లైన్స్ వింటున్నాం. ఎప్పటికప్పుడు వీటిని మనం అప్‌డేట్ చేసుకోకపోతే చాలా ఇబ్బంది పడే అవకాశమే ఉన్నది.

బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగాల్లో నిత్యం ఏదో ఒక కొత్త మార్పు వస్తూనే ఉంటుంది. వాటికి అనుగుణంగా మనం కూడా ప్రిపేర్డ్‌గా ఉండాలి. ఇలా ఈ నెల (అక్టోబర్) ఒకటో తేదీ నుంచి చోటుచేసుకున్న మార్పులేంటో చూద్దాం.




### టీసీఎస్ రూల్ మొదలు

**టీసీఎస్** అంటే ట్యాక్స్ కలెక్షన్ ఎట్ సోర్స్. వాడుక భాషలో చెప్పాలంటే మూలం వద్దే పన్ను వసూలు. విదేశీ పర్యటనలు, విదేశాల్లో క్రెడిట్ కార్డుల వినియోగం, ఫారిన్ ఈక్విటీలు-మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు, క్రిప్టో కరెన్సీల కొనుగోలు, విద్యాభ్యాసం కోసం విదేశాలకు వెళ్లడం వంటి వాటిపై టీసీఎస్ ఉంటుంది. వీటి కోసం వినియోగించే ఖర్చులు ఒక పరిమితి దాటిన తర్వాత బ్యాంకులు సదరు మొత్తంపై టీసీఎస్‌ను వసూలు చేస్తాయి. అయితే మొత్తం ఏడాదికి చేసే ఖర్చును ఇక్కడ పరిగణనలోకి తీసుకుంటారని గుర్తుంచుకోవాలి. లావాదేవీ ఒకసారి జరిగినా, నాలుగుసార్లు చేసినా.. సదరు పరిమితి దాటితే మీరు పన్ను పరిధిలోకి ఆటోమేటిక్‌గా వచ్చేస్తారు. ఇలా టీసీఎస్ అదనంగా తీసుకున్న వాటిని మనం మళ్లీ మన ఐటీ రిటర్న్స్ ఫైల్ చేసినప్పుడు క్లెయిం చేసుకునే సౌలభ్యం ఉంది. అయితే అందుకోసం రిటర్న్స్ ఫైల్ చేసేదాకా ఆగాల్సి ఉంటుంది.

### ఫారిన్ ప్యాకేజీ టూర్లు కష్టమే

**మీ కుటుంబ** సభ్యులతో కలిసి మీరు ఏ దేశానికైనా పర్యటనకు వెళ్లాలంటే ఇప్పుడది మరింత భారమే. రూ.7 లక్షల వరకూ ఏదైనా టూర్ ప్యాకేజీ తీసుకుంటే దానిపై 5 శాతం టీసీఎస్ అదనంగా వసూలు చేస్తాయి సదరు సంస్థలు. రూ.7 లక్షలు దాటితే ఆపై మొత్తం ఎంతైతే ఉంటుందో అందులో 20 శాతం టీసీఎస్‌గా కట్టాల్సిందే. ఇంతకుముందు ఎంతైనా 5 శాతంగానే ఉండేది. ఉదాహరణకు మీరు టూర్ ఆపరేటర్ దగ్గరికి వెళ్లి యూరప్ వెళ్లేందుకు ప్యాకేజీ బుక్ చేసుకున్నారనుకుందాం. సదరు ప్యాకేజీ ధర ఫ్యామిలీ అంతటికి కలిసి రూ.9 లక్షలు. దీంతో ఇందులో రూ.7 లక్షలకు 5 శాతం చొప్పున రూ.35,000, ఆపై రూ.2 లక్షలకు 20 శాతం చొప్పున రూ.40,000 టీసీఎస్ ఉంటుంది. మొత్తంగా రూ.9.75 లక్షలు చెల్లించాలి. అయితే మీరు అధికంగా చెల్లించిన రూ.75 వేలను ఐటీ రిటర్న్స్ దాఖలు చేసినప్పుడు రిఫండ్ చేసుకోవచ్చు. లేదా అడ్వాన్స్ ట్యాక్స్ కట్టినప్పుడు క్రెడిట్ నోట్‌లా కూడా వాడుకోవచ్చు. కానీ భారతీయ ట్రావెల్ ఆపరేటర్స్ నుంచి టూర్ ప్యాకేజీ పొందినప్పుడే ఈ అవకాశం ఉంటుందని గుర్తుంచుకోవాలి.

### విదేశీ చదువులకూ..

**ఆర్బీఐ** లిబరలైజ్డ్ రెమిటెన్స్ స్కీమ్ ప్రకారం.. విద్యాభ్యాసం కోసం ఏడాదికి రూ.7 లక్షల వరకూ చేసే ఖర్చుపై ఎలాంటి టీసీఎస్ ఉండబోదు. అలా కాకుండా అంతకుమించి ఉంటే మాత్రం 5 శాతం టీసీఎస్ వసూలు చేస్తారు. ఒకవేళ లోన్ ద్వారా ఈ నగదును తీసుకుని చెల్లిస్తున్నట్టైతే 0.5 శాతం టీసీఎస్ ఉంటుంది. కానీ దీన్ని మళ్లీ మనం క్లెయిం చేసుకోవచ్చు. అలాగే విదేశాల్లో వైద్యం కోసం చేసే ఖర్చు రూ.7 లక్షలు దాటినా కూడా 5 శాతం టీసీఎస్ పడుతుంది. మీ పిల్లల చదువులకేగాక ఇతర అవసరాల కోసం నిధులు పంపినా దాన్ని విద్యా వ్యయం కిందే పరిగణిస్తారు.

### క్రెడిట్ కార్డుతో కట్టినా..

**ఒకవేళ** రూ.7 లక్షలకు మించి దవాఖాన ఖర్చులు, ఎడ్యుకేషన్ ఫీజు, ఫారెక్స్ కొనుగోలు వంటివి ఉన్నా 20 శాతం టీసీఎస్ తప్పదు. అది క్రెడిట్ కార్డ్ అయినా, డెబిట్ కార్డ్ అయినా ఇంతే. అక్టోబర్ 1 నుంచి ఈ నిబంధన వచ్చింది. ఆర్థిక సంవత్సరంలో రూ.7 లక్షల కంటే దిగువన ఉన్న ఫారెక్స్ ట్రాన్సాక్షన్స్‌పై మాత్రం ఎలాంటి టీసీఎస్ ఉండబోదు. రూ.7 లక్షలకు మించి చేసే విదేశీ కరెన్సీ కొనుగోళ్లపై 20 శాతం టీసీఎస్ అనేది చాలా ఆశ్చర్యకరమైన, వివాదాస్పదమైన నిర్ణయం. సెప్టెంబర్ 30 వరకు రూ.7 లక్షలదాకా ఫారెక్స్ కొనుగోలుపై 5 శాతం మాత్రమే టీసీఎస్ ఉండేది.

### కార్డ్స్‌పై కొత్త రూల్స్

**తమ** ఖాతాదారులకు కొత్తగా డెబిట్ లేదా క్రెడిట్ కార్డ్‌లను జారీ చేసేటప్పుడు నెట్‌వర్క్ ప్రొవైడర్ (వీసా, మాస్టర్ కార్డ్, రూపే)ను బ్యాంకులే నిర్ణయించేవి. కానీ అక్టోబర్ 1 నుంచి ఇది మారిపోయింది. ఖాతాదారులే తమకు నచ్చిన నెట్‌వర్క్ ప్రొవైడర్‌ను ఎంచుకోవచ్చు.

### ఈ నెలాఖరు వరకే..

**కొన్ని** సందర్భాల్లో తెలిసో, తెలియకో.. ఆర్థిక ఇబ్బందుల వలనో ఎల్ఐసీ పాలసీలను కొనసాగించలేకపోతాం. అప్పుడవి ల్యాప్స్ అయిపోతాయి. అయితే సెప్టెంబర్ 1 నుంచి ఇలా మధ్యలోనే ఆగిపోయిన పాలసీల పునరుద్ధరణకు ఎల్ఐసీ అవకాశం ఇచ్చింది. కానీ ఈ నెలాఖరుదాకే ఇది అందుబాటులో ఉంటుంది. పైగా లేట్ ఫీజుపై 30 శాతం తగ్గింపునూ అందిస్తోంది.

### గరిష్ఠంగా 30 ఏండ్లే

**పర్పెచ్యువల్** ఎస్ఐపి (సిప్) కింద ఇక 30 ఏండ్లకు మించి మనం సిప్‌ను కొనసాగించే వీలుండదు. నేషనల్ ఆటోమేటెడ్ క్లియరింగ్ హౌజ్ (నాచ్) నిబంధనల్ని సవరించింది మరి. ఇకపై మ్యూచువల్ ఫండ్ సిప్స్ జారీ అయిన తేదీ నుంచి 30 ఏండ్లే కొనసాగుతాయి. ఇంతకుముందు ఎన్నేండ్లైనా కొనసాగించుకునే అవకాశం ఉండేది.

-నాగేంద్రసాయి కుందవరం

# స్వల్ప శ్రేణిలో ఒడిదుడుకులు




**అంతర్జాతీయ** ప్రతికూలతలతో పాటు సెప్టెంబర్ డెరివేటివ్ సిరీస్ సందర్భంగా నిర్ణీత శ్రేణిలో హెచ్చుతగ్గులకు లోనైన ఎన్ఎస్ఈ నిఫ్టీ చివరకు 36 పాయింట్ల స్వల్పనష్టంతో 19,638 వద్ద ముగిసింది. యూఎస్ బాండ్ ఈల్డ్స్, డాలర్ ఇండెక్స్, కీలకమైన స్పెండింగ్ బిల్లు అమెరికా కాంగ్రెస్ ఆమోదం పొందడం తదితర అంశాలు ఈ వారం మార్కెట్ కదలికలకు కీలకం కానున్నాయి. అక్టోబర్ 2న (సోమవారం) గాంధీ జయంతి కారణంగా ఈ వారం ట్రేడింగ్ నాలుగు రోజులకే పరిమితమవుతున్నది. అయినప్పటికీ మార్కెట్ పరిమిత శ్రేణిలో ఒడిదుడుకులకు లోనుకావచ్చని అధిక శాతం మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. గత వారం నిఫ్టీ డెయిలీ చార్టుల్లో 20 డీఎంఏ, 50 డీఎంఏల దిగువన ముగియడం స్వల్పకాలిక బలహీనతను సూచిస్తున్నదని సామ్కో సెక్యూరిటీస్ సీఈవో జిమిత్ మోది తెలిపారు. అలాగే ఇండియా వొలటాలిటీ ఇండెక్స్ (వీఐఎక్స్) 7 శాతంపైగా పెరగడం ఇన్వెస్టర్లకు ఆందోళన కల్గించే అంశమని జిమిత్ మోదీ చెప్పారు.

### కీలక మద్దతు 19,400

ఈ వారం నిఫ్టీకి 19,400 పాయింట్ల స్థాయి వద్ద కీలక మద్దతు లభించవచ్చని, 19,850-19,900 శ్రేణి వద్ద అవరోధం ఏర్పడవచ్చని జిమిత్ మోదీ అంచనా వేశారు. ర్యాలీ జరగాలంటే 19,750 పాయింట్లపైన నిఫ్టీ ముగియాలని, అటుపైన నిలదొక్కుకుంటే అక్టోబర్ సిరీస్‌లో 20,500-20,700 స్థాయిల్ని అందుకోవచ్చని ఎల్‌కేపీ సెక్యూరిటీస్ రీసెర్చ్ హెడ్ రూపక్ డే విశ్లేషించారు. ఈ వారం నిఫ్టీ 19,470 వద్ద మద్దతు పొందవచ్చని అంచనా వేశారు. ఇక ఈ వారం ప్రథమార్థంలో 19,500 పాయింట్ల వద్ద ఇంట్రాడే సపోర్ట్ లభించవచ్చని, ఇంట్రాడేలో తగ్గినా 19,600పైన ముగిస్తే బుల్లిష్ లేదా సైడ్‌వేస్ ధోరణిలో సూచి ఉంటుందని చార్ట్ ఎనలిటిక్స్ ఫౌండర్ ఎం చెద్దా తెలిపారు.

# 50 ఏండ్ల బాండ్ వస్తున్నది

**కేంద్ర** ప్రభుత్వం మునుపెన్నడూ లేనివిధంగా తొలిసారి 50 ఏండ్ల బాండ్‌ను పరిచయం చేస్తున్నది. దీర్ఘకాలిక సెక్యూరిటీలకు పెన్షన్ ఫండ్స్, జీవిత బీమా సంస్థలు, చారిటబుల్ ట్రస్టుల వంటి సంస్థాగత మదుపరుల నుంచి వస్తున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొనే దీన్ని తీసుకొస్తున్నది. దీంతో ప్రభుత్వ రంగ బీమా కంపెనీ ఎల్ఐసీ ఇన్వెస్ట్‌మెంట్లకు ఈ బాండ్ కలిసొస్తుందన్న అంచనాలు మార్కెట్ వర్గాల్లో వినిపిస్తున్నాయిప్పుడు. కాగా, దేశీయ ఆర్థిక వ్యవస్థలో ఈ బాండ్‌ను ఓ భారీ నిర్ణయంగా పేర్కొంటున్న ఇండస్ట్రీ నిపుణులు.. దీర్ఘకాల ఆర్థిక భద్రతతోపాటు, పెట్టుబడుల ద్వారా తమ రిటైర్మెంట్ ప్రణాళికల్ని వేసుకునే ఎగువ మధ్యతరగతి మదుపరులకు లాభిస్తుందన్న అభిప్రాయాన్నీ వ్యక్తం చేస్తున్నారు. జీవిత బీమా, పెన్షన్స్, ప్రావిడెంట్ ఫండ్స్‌ల్లో గృహస్తుల పొదుపే ఎక్కువగా ఉంటుందని, ఈ బాండ్ల రాకతో వారి సొమ్ముకు మరింత ప్రయోజనం కలుగుతుందని బ్యాంకింగ్ విశ్లేషకులూ చెప్తున్నారు. కాగా, అక్టోబర్ 30 నుంచి నవంబర్ 3 వరకు రూ.10,000 కోట్ల విలువైన బాండ్లను అమ్మనున్నారు.